క్లుప్తంగా

భట్టిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



భట్టివిక్రమార్కతో కాంగ్రెస్ నాయకులు

బోనకల్: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు హైద్రాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన సమస్యలను వివరించారు. ఆళ్లపాడు నుంచి నారాయణపురం వరకు, ఆళ్లపాడు నుంచి రావినూతల వరకు బీటీ రహదారిని నిర్మించాలని కోరారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు యాదవ కమ్యూనిటీ హాల్, హైస్కూల్ అప్‌గ్రేడ్ చేయాలని విన్నవించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన భట్టి విక్రమార్క పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆళ్లపాడు కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బుంగ రాములు, ఎంపీటీసీ సభ్యులు పారా శ్రీదేవి వెంకట మోహన్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

డీటీఓను కలిసిన రుక్మిణి



కల్లూరు: కరీంనగర్ నుంచి ఖమ్మం బదిలీపై వచ్చిన జిల్లా రవాణాశాఖ అధికారి ఎస్‌కే గౌస్ పాషాను శుక్రవారం ఖమ్మం కార్యాలయంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు ఎనుముల రుక్మిణి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆమెతో పాటు కాంగ్రెస్ నాయకుడు ఎనుముల రాము ఉన్నారు.

దరఖాస్తు చేసుకోండి

సత్తుపల్లి: సత్తుపల్లిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.వెంకటరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులు సమర్పించాలన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మధిర: మధిర తహసీల్‌లో శుక్రవారం తహసీల్దార్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఎస్టీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్టీఎఫ్ నాయకులు కోటారెడ్డి, కమాల్, శ్యామ్ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

వేంసూరు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని డీటీ కరుణశ్రీ అన్నారు. శుక్రవారం తహసీల్‌లో బీఎల్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 20,21 తేదీల్లో ఓటరు నమోదుకు నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌కు ప్రతి ఒక్క బీఎల్‌ఓ అందుబాటులో ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఈ నెల 22 వరకు ఆన్‌లైన్ చేసుకోవాలని తెలిపారు.

దివ్యాంగులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న స్వర్ణలత

మధిరరూరల్: మదర్ థెరిస్సా సేవాసదనంలో మానసిక వికలాంగులకు శుక్రవారం అన్నదానం చేశారు. శరత్, శ్వేత దంపతుల కుమార్తె యషిక మొదటి పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు స్వర్ణలత.. అన్నదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

ఆటోడ్రైవర్ల శ్రమదానం

కారేపల్లి: కారేపల్లి క్రాస్‌రోడ్డులోని ఆటో డ్రైవర్లు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. రహదారికి ఇరువైపుల ఉన్న చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు తెలిపినా ఉపయోగం లేకపోవడంతో వారే స్వచ్ఛందంగా శ్రమదానానికి పూనుకున్నారు. కార్యక్రమంలో ఆటోవాలాలు బొమ్మల కృష్ణమూర్తి, శ్రీను, ఎస్‌కే.ఖాదర్, ప్రసాద్, కుమార్, బాషాసింగ్, వీరయ్య, శ్యామ్, బాలు, సుధాకర్ పాల్గొన్నారు.



శుభ్రం చేస్తున్న ఆటోడ్రైవర్లు

డ్రిప్ అందేనా?



డ్రిప్ ఆధారంగా సాగు చేసిన మొక్కజొన్న పంట

- కొత్త ప్రభుత్వంపై రైతుల ఆశలు
- ప్రస్తుతం ఆయిల్ పామ్‌కే అందజేత
- ఐదేళ్లుగా అమలకు నోచుకోని పథకం
- సబ్సిడీ అందించాలని కోరుతున్న వైనం..

వేంసూరు: రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా రైతులకు సబ్సిడీపై డ్రిప్ పథకం అమలు చేస్తారనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. బిందు సేద్యం ద్వారా పంటలకు తడులు అందించేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీపై అందించే డ్రిప్ పరికరాల పథకం ఐదేళ్ల కాలంగా నిలిచిపోయించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని కేవలం ఆయిల్ పామ్‌కు పరిమితం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో రైతులకు సబ్సిడీ ఇలా...

పంటల సాగులో నీటి వృథాను తగ్గించి తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆరుతడి, పండ్లు, కూరగాయల సాగుకు డ్రిప్‌లు అందించేవారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఐదేళ్ల నుంచి డ్రిప్‌కు సబ్సిడీ అందించడం లేదు బీఆర్‌ఎస్ కన్నా ముందు ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం చిన్న, సన్నకారు రైతులకు 90శాతం, సబ్సిడీ ఇవ్వగా.. పెద్ద రైతులకు 12ఎకరాలకే పరిమితం చేయడంతో పాటు 80శాతం మేర సబ్సిడీ ఇస్తూ ఇచ్చింది.

డ్రిప్ ఆధారంగా సాగు చేసే పంటలు..

గతంలో అన్ని రకాల పంటలకు ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ అందించింది. మండలంలో ప్రధానం సాగుచేసే మొక్కజొన్న, మిర్చి, నిమ్మ, మామిడితో పాటు పలు రకాల పంటలకు డ్రిప్ అందించే నీటి ఆదాతో పాటు నీటి తడులకు కూలీల ఖర్చు తగ్గుతుందని రైతులు ఆశిస్తున్నారు. ప్రభుత్వం కేవలం ఆయిల్‌పామ్ రైతులకే డ్రిప్ అందించడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్‌గా కొనుగోళ్లు..

ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు నిలిపి వేయడంతో రైతులు విధిలేని పరిస్థితిల్లో ప్రైవేట్‌గా డ్రిప్ కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రధానం మొక్కజొన్న, మిర్చి రైతులు డ్రిప్‌పై ఆధారంగా సాగు చేస్తున్నారు. గతంలో హెక్టార్‌కు 10శాతం రైతు చెల్లిస్తే, 90శాతం ప్రభుత్వం రాయితీ డ్రిప్ అందించేది.. కానీ ప్రభుత్వం ఆ పరిస్థితి లేక పోవడంతో రైతులు ఎకరాలకు రూ.20 నుంచి 30వేలు ఖర్చు చేసి డ్రిప్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఐదేళ్లుగా ఎదురుచూస్తున్నాం..



నేను 5 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశాను. గతంలో ఇచ్చినట్లుగా సబ్సిడీ డ్రిప్ అందిస్తారని ఐదేళ్ల నుంచి ఎదురు చూస్తున్న. ప్రభుత్వం నుంచి రాకపోవడంతో ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ అందిస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– గుంట్రు వెంకటరామారావు, రైతు, కల్లురుగూడెం

రైతులకు ఎంతో ఉపయోగం..



ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై డ్రిప్ అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నీటివృథా తగ్గడంతో పాటు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసే అవకాశం ఉంటుంది. పలు రకాల పంటలకు డ్రిప్‌పై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నాం. కొత్త ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ అందించాలి.

– భీమిరెడ్డి చెన్నకేశవరెడ్డి, రైతు, మర్లపాడు

సబ్సిడీ పథకాలు వినియోగించుకోవాలి

వేంసూరు: స్వయం ఉపాధి కల్పించుకోవడంతో పాటు మరికొంత మందికి ఉపాధి అందించే కేంద్ర సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని వేంసూరు ఏపీజీవీబీ మేనేజర్ కిషన్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని లింగపాలెం, అమ్మపాలెం గ్రామాల్లో వికసిత భారత్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు స్వయం ఉపాధి పొందేందుకు పీఎంఈజీపీ, పీఎంఎస్‌ఎంఈ వంటి పథకాల ద్వారా35 శాతం సబ్సిడీపై రుణాలు పొందొచ్చన్నారు. సరైన ప్రాజెక్ట్ ఎంచుకొని బ్యాంకులను సంప్రదిస్తే రుణాలు మంజురు అవుతాయని తెలిపారు. ఉన్నత విద్య, వ్యవసాయం తదితర రుణాలను బ్యాంకులు అందజేస్తున్నాయని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా బీమా పథకం వర్తింపు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్ కుమార్, ఏపీఎం శ్రీనివాసరావు, ఎర్ర రమేష్, మట్టా ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామమందిరంపై రాజకీయం తగదు

కారేపల్లి: రానున్న ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసమే రామమందిరంలో బాలరాముడు ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మోదీ వినియోగించుకుంటున్నారని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి టి.ఝాన్సీ అన్నారు. శుక్రవారం మండలంలోని మాధారంలో ప్రజాపంథా మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ అధ్యక్షతన జరిగిన మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రామ మందిరంలో బలరాముడు ప్రతిష్ఠకు కేంద్ర ప్రభుత్వం మితిమీరి జోక్యం.. ప్రజల విశ్వాసాలను మతపరమైన భావోద్వేగాలను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తికాని మందిరాన్ని హడావుడిగా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజల మనోభావాలను అవమానపరచడమే అని ఆమె ఖండించారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఎన్‌వీ రాకేష్, మండల నాయకులు గుగులోతు తేజ, వెంకటేశ్వర్లు, భాస్కర్, సత్తిరెడ్డి, వీరన్న, నాగన్న, అనసూయ, సరోజిని, పాపారావు, బాలు, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఝాన్సీ

అయోధ్య అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు

మధిర: ఇల్లెందులపాడు గ్రామంలో శుక్రవారం అయోధ్య రామ మందిరం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా గ్రామంలో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో అక్షింతలు ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి అక్షింతలను ఇంటింటికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సూర్యదేవర కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, సామినేని రామనాథం, బోడేపూడి గోపీనాథ్, నీరుకొండ సుభాష్ బాబు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుల నియామకం

మధిర: మధిర రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా బీజేపీ నాయకులు ఏలూరు నాగేశ్వరావు, చిలువేరు సాంబశివరావు, గుండా చంద్రశేఖర్ రెడ్డి, పాపట్ల రమేష్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం మధిర రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ పద్మారావు చేతుల మీదుగా వారు నియామకపు ఉత్తర్వులు అందుకున్నారు. తమ నియామకానికి సహకరించిన కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డికి, బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

బోనకల్: బోనకల్ రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోళ్ల భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోత్ నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు వీరపనేని అప్పారావు, దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి సరేష్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి జంపాల రవి నియమితులయ్యారు.



మధిర: ఉత్తర్వులు అందుకుంటున్న సభ్యులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: తల్లాడ, కుర్నవల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని కుర్నవల్లి, కలకొడిమ, బస్వాపురం గ్రామాల్లో, తల్లాడ, నారాయణపురం, మల్లవరం గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈలు రాజేష్, సుందర్‌కుమార్ తెలిపారు. కుర్నవల్లి, కలకొడిమ ఫీడర్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తల్లాడ పట్టణంలో ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. కావున వినియోగదారుల సహకరించాలని కోరారు.

ఎర్రుపాలెం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా.. సబ్‌స్టేషన్ పరిధిలోని ఎరుపాలెం, పెద్దగోపవరం, మీనవోలు, రేమిడిచర్ల, జమలాపురం ఫీడర్ల పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ జి.అనూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కారేపల్లి: కారేపల్లిక్రాస్‌రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని గౌరిగూడెం 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని గౌరిగూడెం, కొత్తూరు, రేజర్ల, సర్వారాయ, రాజీవ్‌నగర్ ప్రాంతాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని టౌన్ ఏఈ శరత్‌బాబు శుక్రవారం తెలిపారు.

కల్లూరు రూరల్: పోచారం ఫీడర్‌లోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, పోచవరం, వెన్నవెల్లి, తెలగవరం, మర్లపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని ఏఈ తెలిపారు.

22న సీతారాముల విగ్రహాల ఊరేగింపు

సత్తుపల్లి: పట్టణంలోని వేంసూరురోడ్ మెట్టాంజనేయస్వామి ఆలయంలోని శ్రీకోదండ సీతారామలక్ష్మణ సమేత మెట్టాంజనేయస్వామి లను ఈ నెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఊరేగింపు నిర్వహించబడుతుందని ఆలయ కమిటీ నిర్వాహకులు కాలినేని కాంతారావు, మందపాటి రవీందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోలాట నృత్యాలు, రామనామ సంకీర్తనలతో జరిగే ఈ ఊరేగింపులో ప్రజలందరు పాల్గొనాలని కోరారు.

29న ఎస్‌ఎంసీ ఎన్నికలు

కొణిజర్ల: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలు ఈ నెల 29న నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ మోదుగు శ్యాంసన్ శుక్రవారం ఓక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో ఒక్కో తరగతి నుంచి గరిష్ఠంగా ముగ్గురు సభ్యులను ఎన్నుకుని వారి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక నిర్వహించడం జరగుతుందన్నారు. ఎన్నిక అనివార్యమైతే హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు (సభ్యులు) చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 8 తరగతులు విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే ఎన్నికలో పాల్గొనే అవకాశం ఉందన్నారు.

ఘనంగా యోగివేమన జయంతి

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీబాలాజీ భవనంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగి వేమన చిత్రపటానికి భవనం కన్వీనర్ కర్నాటి శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎంలు దండెం సత్యనారయణరెడ్డి, యస్.జ్యోతిశ్రీ నివాళి అర్పించారు. సమాజానికి వేమన అందించిన సేవలను కొనియాడారు. నేటి సమాజానికి ఆయన అందిచిన సాహిత్యం దార్శకనీయమన్నారు. అనంతరం పద్యాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

మధిర: ఈ నెల 21న మధిర పట్టణంలోని టీవీఎం పాఠశాలలో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ మధిర మండల మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఏ.వినోదరావు, షేక్.నాగూర్ వలి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మహాసభలో సంఘ కార్యకలాపాల నివేదిక చర్చ, నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని పేర్కొన్నారు. సభ్యులందరూ సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

కల్లూరు: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నడుపబడుతున్న తెలంగాణలో ఉన్న క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ప్రస్తుత విద్యాసంవత్సరం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవకాశం ఉందని స్థానిక జెడ్పీ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పి.వీరరాఘవయ్య తెలిపారు. పూర్తి వివరాలకు నంబర్ 9440669401ను సంప్రదించాలని కోరారు.

బీసీల అభ్యున్నతికి కృషి

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అన్ని విధాల సహకరిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బీసీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ అధికారులు కలిసి ఆమెను సత్కరించారు. ముందుగా రామజన్మభూమి తీర్థక్షేత్రం జాగృతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. రేజర్లలో నాలుగురోజుల బాలింత మందా స్వాతి మృతి చెందటంతో కుటుంబాన్ని పరామర్శించి.. అండగా ఉంటానన్నారు. కార్యక్రమాలలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, సర్పంచ్ ప్రభాకర్, సుబ్బారెడ్డి, దామోదర్‌రెడ్డి, రవీందర్, కోరుకొండ వెంకటేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు, పసుమర్తి గోపాలరావు, శారద, రోజా, కుమారి, చక్రధర్‌రావు, రామకృష్ణ, రమేష్, రాంబాబు పాల్గొన్నారు.



జాగృతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

నాణ్యతాలోపమే ప్రధాన కారణం

- గాయపడ్డ కూలీలకు నష్టపరిహారం ఇవ్వాలి
- సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా

వైరా: ఖమ్మం టూ దేవరపల్లి గ్రీన్‌ఫీల్డు హైవే రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతోనే బ్రిడ్జి కూలి నలుగురు కార్మికులు గాయాల పాలయ్యారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం తెలిపారు. శుక్రవారం కూప్పకూలిన బ్రిడ్జిని సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం పరిశీలించింది. అనంతరం గాయపడ్డ కూలీలను పరామర్శించి సదరు నిర్మాణ కంపెనీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను నేషనల్ హైవే అథారటీ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే పనులు నాసిరకంగా చేస్తున్నారన్నారు. కూలిన బ్రిడ్జి మెటీరియల్‌ను రాత్రికి రాత్రే సదరు కాంట్రాక్టర్ బయటకు తరలించడంతో పాటు గాయపడ్డ కార్మికులను పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. తక్షణమే గాయపడ్డ కూలీలకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, తూము సుధాకర్, రమణ, జమాల్, వెంకటేశ్వరరావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కూలీలు

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు..



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రఘు

కల్లూరు: చిరు వ్యాపారులు తమ తోపుడు బండ్లను ప్రధాన రహదారిపైకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై పి.రఘు సూచించారు. శుక్రవారం కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చిరు వ్యాపారులతో ఎస్సై, ఎంపీడీఓ రవికుమార్, డాక్టర్ లక్కినేని రఘులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల జీవనాధారమైన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకోవచ్చునని దీనికి ఎలాంటి అభ్యంతరం లేదని, కాని తమ తోపుడు బండ్లను మాత్రం రోడ్డుకు దూరంగా డ్రెయినేజీ వరకు జరపాలని కోరారు. దీని వల్ల ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. నాలుగు రోజుల్లో రహదారికి ఇరువైపులా బండ్లు, ఇతర వ్యాపారాలు దూరంగా పెట్టుకోవాలని, లేనట్లైతే పోలీస్‌శాఖ వారే చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

వైరాలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ జైపాల్

వైరా: వైరా సంతబజార్ పాత పంచాయతీ కార్యాలయంలో గ్రేస్ హాస్పిటల్ తనికెళ్ల వారు శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, మిట్టపల్లి నాగి, దార్న శేఖర్, బోళ్ల గంగారావు, పణితిసైదులు, కర్నాటి హనుమంతరావు, అష్టగుర్తి సర్పంచ్ ఇటుకుల మురళి, సూర్యదేవర శ్రీధర్, శేఖర్, గోపి, ఆనందరావు, శ్రీను, హనుమంతరావు, గ్రేస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖేలో ఇండియా పోటీలకు మేడేపల్లి విద్యార్థిని



యువవర్షిణి

ముదిగొండ: తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19నుంచి గజ్వేల్‌లో ఎంజేపీ కళాశాలలో ఖేలో ఇండియా బాలికల అండర్17 ఫుట్‌బాల్ లీగ్‌లో ఎంపికైనట్లు మేడేపల్లి జెడ్పీఉన్నత పాఠశాల పీఈటీ బియ్యని కృష్ణయ్య తెలిపారు. హైద్రాబాద్ ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్ నుంచి క్రీడలకు మేడేపల్లికి పాఠశాలలో చదివే యువవర్షిణికి అవకాశం దక్కిందన్నారు. దీంతో ఆమెను ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ఎస్‌ఎంసీ చైర్మన్ సమతా, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రయోగశాల కృత్యాల ప్రదర్శన



అవగాహన కల్పిస్తున్న భానుప్రకాష్

ముదిగొండ: మండలంలోని బాణాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతి విద్యార్థుల కోసం భౌతిక రసాయనికశాస్త్ర ప్రయోగశాల కృత్యాల వర్క్‌షాపు నిర్వహించారు. అక్షయ నాలెడ్జ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రయోగాల ద్వారా విద్యార్థులు తయారు చేసిన వర్క్‌షాపును ఏర్పాటు చేశారు. ఎన్నారై భానుప్రకాశ్ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బాణాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, బాస్కర్‌రావు, వినోద, కృష్ణప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిన్నమ్మగూడెంలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు



సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పెనుబల్లి: సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని చిన్నమ్మగూడెంలో శుక్రవారం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులు దేశిన్ని శ్రీనివాసరావు ఇచ్చిన రూ.18,000ల విరాళంతో చిన్నమ్మగూడెం తండాలో ఆరు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు పోట్రు ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు ఎస్‌కే అబ్దుల్ సలాం, సుంకర సత్యనారాయణ, ట్రెజరర్ పొన్నగంటి వినాయక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదుతో కేసు

కల్లూరు: మండలంలోని ముగ్గు వెంకటాపురం పంచాయతీ పరిధి చైతన్యనగర్‌కు చెందిన కోటా లక్ష్మి తనపై దాడి జరిగిందని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఆమె తన భర్త ద్వారా సంక్రమించిన ఇంట్లో నివాసముంటోంది. అయితే, ఈనెల 8న ఏడుగురు మహిళలు తనపై అకారణంగా దాడి చేశారని ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

సెలవు దినంగా ప్రకటించాలి

తల్లాడ: లంబాడీల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న సంత్ సేవాలాల్ జయంతిని ఫిబ్రవరి 15న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ధర్మసోత్ దశరథ్‌నాయక్ అన్నారు. మండలంలోని మల్సూర్‌తండా గ్రామంలో రవి నాయక్ అధ్యక్షతన జరిగిన హెల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో పలు మార్లు బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలకు సెలవు దినంగా ప్రకటించాలని కోరినప్పటికీ ఎలాంటి స్పందన రాలేదన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకొచ్చిన తర్వాత తొలిపండుగా జరుపుకుంటున్నామని, సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ కృష్ణ నాయక్, భూక్యా రవినాయక్, నందా నాయక్, రామక్రిష్ణ నాయక్, బాషా నాయక్, బాబా నాయక్, సోటిబాయి, బద్రిబాయి, లక్ష్మీబాయి, తులసీబాయి, వాలీబాయి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గిరిజనులు